# హైదరాబాద్ జనజీవితంలో ఉర్దూ సామెతలు



పరవస్తు లోకేశ్వర్

398.91439
లోకేశ్వ - హైదరా
98486

# హైద్రాబాద్ జనజీవితం
# ఉర్దూ సామెతలు



రచయిత

పరవస్తు లోకేశ్వర్

ముద్రణ

గాంధీ ప్రచురణలు

# హైద్రాబాద్ జనజీవితం ఉర్దూ సామెతలు

రచయిత : పరవస్తు లోకేశ్వర్

ప్రచురణ : గాంధీ ప్రచురణలు, హైద్రాబాద్
ప్రథమ ముద్రణ : నవంబర్ 2011

వెల : రూ. **30** /-

398.91439
e18982
సుందరయ్య గ్రంథాలయ సంస్థ
ACC No. 98486
హైదరాబాద్ - 500032

రచయిత చిరునామా
**పరవస్తు లోకేశ్వర్**
ఇంటి నెం. 12-2-709/5/1/సి,
నవోదయ కాలనీ, మెహిదీపట్నం,
హైదరాబాద్ - 500 028.
సెల్ నెం. 9160680847
9392698814

ప్రతులు దొరుకు చోటు : అన్ని ప్రముఖ పుస్తక షాపులలో లభించును.

కవర్‌పేజి డిజైన్ :డి.టి.పి.& పేజ్ లే-ఔట్ : విజయ్-సరళ,
ధరణీ గ్రాఫిక్స్, హైదరాబాద్ - 9491875063.

ముద్రణ : కర్షక ఆర్ట్ ప్రింటర్స్, ఓ.యు. రోడ్, విద్యానగర్, హైదరాబాద్ -44



సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A.C. No.

# అంకితం



తిరునగరి కమలమ్మ   పరవస్తు ఆండాళమ్మ   బూరుగుగడ్డ గోదమ్మ

మాట మాటకు సామెతలు

వైన వైనాలుగా ముచ్చట్లు, కతలు

చెప్పిన ఇద్దరు మేనత్తల మధ్య

మా నాయనమ్మ

(వరంగల్ జిల్లా మడికొండ వాస్తవ్యులు)



# ఈ ఉర్దూ సామెతల పుస్తకం ఎందుకు ...?

ఉర్దూ భాషలో 'ముహావరా' అంటే సామెతలు అని అర్థం. ఒక ప్రత్యేక ప్రాంతంలో అక్కడ నివసించే ప్రజల వైవిధ్య భరిత విస్తృత జీవితానుభవాల సారాం శమే సామెతలు. ప్రతి సామెత వెనుక ఒక లోకోక్తి ఒక నీతికథ దాగి ఉంటుంది. ప్రజల వాడుక భాషలో సామెతలు ఒక విడదీయరాని అంతర్భాగం. కాలక్రమేణా సామెతలు ఒక సంప్రదాయంగా మారిపోతాయి.

హైద్రాబాద్ నగర ప్రజల జీవితంలో ఉర్దూ సామెతలకు విశిష్టమైన స్థానం ఉంది. నాలుగు వందల సంవత్సరాల నగర సంస్కృతిలో ఉర్దూ సామెతలు తెలుగు భాషలో 'పాన్ సుపారీ' లాగా కల్సిపోయాయి. హైద్రాబాద్ నగర గంగా జమునా తెహజీబ్‌కు (సంస్కృతి) ఈ సామెతలు ఒక మంచి ఉదాహరణ. ఈ నగర ప్రజలు తెలుగులో మాట్లాడుకుంటనే అనుకోకుండా, అలవోకగా ఉర్దూ సామెతలను తమ సంభాషణలో చొప్పిస్తూ ఉంటారు. ఈ సామెతల మరో ప్రత్యేకత 'హాస్యరసం' ఎంతటి గంభీర చర్చలలోనైనా ఈ సామెతల వాడకం వలన మనుషుల మధ్య సామరస్య వాతావరణం ఏర్పడి 'వాడివేడివాద వివాదాలు' మేఘాలవలె పలుచబడి తేలిపోతాయి. ప్రతిద్వందుల హృదయాలు తేలిక అవుతాయి.

ఒకప్పుడు అమీరుల నుంచి గరీబుల వరకు పండితుల నుంచి పామరుల వరకు సకల జనులందరూ, ఈ ఉర్దూ సామెతలను విరివిగా వాడేవారు. కాని కాలక్రమేణా సీమాంధ్ర వలసవాదం, ప్రపంచీకరణ, ఆంగ్లభాష ఆధిక్యత వలన ఈ సామెతలన్నీ వాడకంలో లేక విస్మృతిలోకి జారుకుంటున్నాయి. ఈనాటి నవతరానికి ఆ సామెతల సౌందర్యం, సొగసుల గురించి ఏమీ తెలియదు. మన సవాలక్ష పరాయీకరణలలో ఇది కూడా ఒక భాగమే. కావున వాటి పరిరక్షణ కోసం, పునరుద్ధరణ కోసం కొన్ని 'ముహావరాల'ను పేర్కొంటూ వాటి భావాన్ని, సందర్భోచిత ప్రయోగాన్ని ఇంకా వీలైన చోట్ల వాటికి అనుగుణంగా దగ్గరగా ఉండే తెలుగు సామెతలను కూడా వివరించటానికి ప్రయత్నిస్తాను.

నాలుగు కోట్ల తెలంగాణా ప్రజల గుండె చప్పుడు "నమస్తే తెలంగాణా" దినపత్రిక 'చెలిమె' సాహిత్యశీర్షికలో ఇందులోని కొన్నిసామెతలు ప్రచురించబడినాయి. దానికి ప్రతిస్పందనగా పాఠకుల నుంచి అనేక అభినందనలు వచ్చాయి. నగర సంస్కృతిని రక్షించుకోవటం కోసం ఈ సామెతలను ఒక పుస్తక రూపంలో తీసుకు రమ్మని అభ్యర్థనలు వచ్చాయి. వారి కోరికను మన్నిస్తూ ఈ సామెతల పుస్తకాన్ని మీ ముందుకు తీసుక వస్తున్నాను. ఇందులోని అశ్లీల సామెతల గురించి ఒక విన్నపం, ఇవి పలకటానికి, వినటానికి ఇబ్బందిగా ఉన్నా మనస్సులో వాటి ఉద్దేశ్యం మాత్రం బూతుకాక మనుష్యుల ప్రవర్తనను సంస్కరించటం, హెచ్చరించటంగా స్వీకరించాలి.

ఆఖరున మరోమాట. ఈ సామెతలను ప్రోత్సహిస్తూ ప్రచురించిన మిత్రుడు నమస్తే తెలంగాణా సంపాదకుడు అల్లం నారాయణకు బహుత్ బహుత్ శుక్రియాలు మరియు సలాములతో ...

మీ

**పరవస్తు లోకేశ్వర్**

తేదీ : 7-11-2011



# ఇందులోని సామెతల వర్గీకరణ ...


1. హాస్య, వ్యంగ్య సామెతలు ... 1
2. మద్యపానానికి సంబంధించిన సామెతలు ... 8
3. జంతువులు పక్షులకు సంబంధించిన సామెతలు ... 11
4. నైతిక, తాత్విక, మత సంబంధ సామెతలు ... 16
5. తిట్టు సామెతలు ... 21
6. అశ్లీల సామెతలు ... 25
7. దాంపత్య స్త్రీ–పురుష సామెతలు ... 29
8. వ్యాపార వ్యవహారిక సామెతలు ... 32



# హాస్య వ్యంగ్య సామెతలు

## పడ్ పడ్‌కర్ పాగల్ బన్‌గయా<br>నఖల్ మార్ కర్ నవాబ్ హో గయా ...

చదివి చదివి బుర్ర చెడగొట్టుకున్న వాడు పిచ్చివాడిగ మారితే, కాపీ కొట్టినవాడు మాత్రం అధికారిగా మారినాడట. నేటి లోకరీతికి అద్దం పట్టే సామెత ఇది. అడ్డదారులు తొక్కేవారు అందలాలెక్కడం మనకు తెలిసిన సంగతే కదా!

"ఎక్కాలు లెక్కలు తెలవనోళ్లు ఎమ్మెల్యేలు, మంత్రులై వెలిగిపోతుంటే బుర్ర చెడగొట్టుకొని చదివినోళ్లు మాత్రం సర్కారీ నౌఖరీలల్ల మురిగి పోతారు" అన్న శివ సిన్మాలోని పాట ఈ సామెతకు సరిగ్గ సరిపోతుంది.

## జాన్ న పహెచాన్ మై తేరా మెహమాన్

ముక్కు ముఖం తెలవనోడు వచ్చి నీ చుట్టాన్ని అన్నట్లు. కొత్తవారు ఎవరైనా వచ్చి ఏదైనా సహాయం అడిగినపుడు లోలోపల విసుక్కుంటూ ఈ సామెతను ప్రయోగిస్తారు.

## బాప్ ఏక్ నంబరీ
## బేటా దస్ నంబరీ

తెలుగులో దీనికి దగ్గరగా ఉండే ముతక సామెత, తండ్రిపోయి తంతెల మీద ఏర్గితే, కొడుకుపోయి కొనేట్ల ఏర్గిండట. తప్పుడు పనులలో తండ్రిని మించిన కొడుకు అని అర్థం.

## మక్కి కి మక్కీ

పరీక్షలలో కాపీ కొట్టే వారికి ఇది వర్తిస్తుంది. అట్లనే ఇతరులను అనుకరించే వారికి కూడా. పరీక్షలో ఎదుటి విద్యార్థి జవాబులు రాస్తుంటే ఒక ఈగ వచ్చి ఆన్సర్ షీట్ పై వాలితే... ఆ విద్యార్థికి కోపం వచ్చి టపీ మని దానిని కొడితే ఆ ఈగ పేపర్‌కు అంటుకుని చచ్చిపోయిందట. వాడి వెనుక కూచుని కాపీ చేస్తున్న మరో విద్యార్థి తను కూడా ఒక ఈగను వెతికి చంపి తన జవాబు పత్రానికి అంటించాడట. మక్కీ అంటే ఈగ అని అర్థం. దీనికి సంబంధించిన మరో ఉర్దూ సామెత 'లికీర్ కే ఫకీర్'.

## బేగాని షాదీ మే అబ్దుల్లా దివానా

పిలవని పేరంటానికి వెళ్లి అవమానాల పాలు కావొద్దని ఇదొక హెచ్చరిక నీతి. కొందరు అనవసరంగా ఇతరుల విషయాలలో తలదూర్చి నవ్వులపాలు అవుతారు. అటువంటి వారిని చూసి ఎగతాళిగా ఈ సామెతను వాడుతారు.

## సర్కారీ నల్లా చౌబీస్ గంటా ఖుల్లా

ఏడవ నిజాం కాలంలో 24 గంటలూ నల్లాలో పరిశుభ్రమైన నీళ్లు వచ్చేవి. ఆ దాతృత్వానికి సంబంధించిన సామెత ఇది. నీళ్లమీద పన్ను వేద్దామని ఎవరో సలహా ఇస్తే ఏడవ నిజాం మండిపడి తిండి ఎలాగూ పెట్టలేం, కనీసం తాగే నీళ్లైనా ఫ్రీగా ఇవ్వక నేను బద్నాం కావాలా అని అరిచాడట. అప్పుడు ఈ సామెత పుట్టింది.

నగరంలో ఈ నీళ్ల కరువు రోజులలో ఈ పాత సామెతను గుర్తు చేసుకుని పాత హైద్రాబాదీలు పాత జ్ఞాపకాలలోకి వెళ్లిపోతారు.

## అలిగిపోయిన అలిసాబూ అటే పోయిండు
## పిలవబోయిన పీరుసాబూ అటే పోయిండు

తెలుగు ఉర్దూల సమ్మేళనానికి ఈ సామెత మరో ఉదాహరణ. తెలంగాణా పల్లెలలో రెండు భాషల్ని కలగలిపి "గంగాజమునా సంస్కృతి"లాగా మాట్లాడటం వినటానికి అందంగా కన్పిస్తుంది. "సందట్లో సడేమియా" సామెత కూడా ఇలాంటిదే.

## జో కహేగీ సర్కారీ వొహీ పకేగీ తర్కారీ

నవాబుగారు చెప్పిందే అంతిమ తీర్పు, అంతిమ నిర్ణయం. లేదా ఇంటి యజమాని చెప్పిన వంటకాన్నే ఇల్లాలు వండుతుందని ఇది ఒక లోకోక్తి. పెద్దల వాక్యం వేదవాక్యం అన్నమాట.

## ఏక్ అనార్ - సౌ బీమార్

ఒక ఖంజూస్ ఆద్మీ (పిసినారి) దవాఖానాల ఉన్న బీమారోల్లను (రోగులను) చూసేటందుకు పోత పోత ఒక అనార్‌ను (దానిమ్మ పండు) లింగు లింగుమని పట్టుక పోయిండంట. ఒళ్లు మండిన ఒక రోగి, బహుశా వాడు కవి కావచ్చు. 'ఏక్ అనార్ సౌ భీమార్' అని హేళనగా వ్యాఖ్యానించిండట. అట్ల ఈ సామెత చెలామణిలోకి వచ్చింది. ఇంట్లె తినేటోళ్లు ఎక్కువగా వున్నప్పుడు, మిఠాయిలో, పండ్లో కూరగాయలో మనం తక్కువగా పట్టుకపోతే 'ఎవని ముక్కుల పెట్టే తందుకు ఇవి పట్కొచ్చినవ్ రా' అని అమ్మకోప్పడటం ఈ సామెతను గుర్తు చేస్తది.

## ఊపర్ శేర్వాని - అందర్ పరేషానీ

దీని వెనుక రెండు రకాల కథలు వున్నాయి. ఒక ఆడంబరుడు దాబు కోసం పైన ఖరీదైన శేర్వానీ వేసుకున్నాడు కానీ లోపల చొక్కా మాత్రం చింపులదే. 'హంసలను అనుకరించే కాకి వోలె' పైసలు లేకున్నా ఖరీదైన

శేర్వానీ కొనుక్కున్నాడు. కానీ లోపలి లాల్చీకి పైసలు లేక చిరుగులదే వేసుకొని ఎవరైనా గమనిస్తారని దావత్‌ల పరేషాన్ పరేషాన్‌గ నిలబడ్డడు. ఆఖరికి ఎవడో ఒకడు గమనించి 'ఊపర్ శేర్వానీ – అందర్ పరేషానీ' అని గుట్టు రట్టు చేసిండు. దీనినే తెలుగుల 'పైన పటారం లోన లొటారం' అంటారు. మరో కథ. ఎండకాలం మిట్ట మధ్యాహ్నం శేర్వానీ వేసుకుంటే చూసేటందుకు మీద బాగనే వుంటది. కాని లోపల చెమటలు పట్టి పరేషాన్ అయితది. 'ఇంట్లో ఈగల మోత బయట పల్లకీ మోత' అన్న సామెత కూడా దీనికి దగ్గరగా వుంటది.

## చల్నేదో బాల్ కిషన్

ఈ మాట భీ ఏడికెల్లి ఇంపోర్ట్ అయ్యిందో ... భాషా శాస్త్రవేత్తలను అడుగాలె. గాని డెబ్బై దశకంలో ప్రతివొక్కరి నోటిమీద ఈ మాటనే డాన్స్ చేసెడ్డి. 'ఒకే బాస్, ఒకే భై' అనే బదులు 'చల్నేదో బాల్ కిషన్' అనేటోల్లు. బహుశా బాలకిషన్ పేరు హైద్రాబాద్‌ల సర్వనామమేమో? ఆమ్ ఆద్మీలందరికీ ఆ పేరు ఎక్కువగా ఉండేదేమో? ఐందల్ ఐందల్ (ఏందో ఏమోగని) ఈ పదం కనిపెట్టినోడ్ని కనిపెట్టి పట్టుకుని వానికి నోబుల్ బహుమతి ఇవ్వాలె. ఈ సామెత ముందు నిజాం కాలేజీ విద్యార్థులు విరివిగా వాడంగనే అది ఉస్మానియా యూనివర్శిటీకి అక్కడి నుండి లా కాలేజీకి వెళ్ళి హైద్రాబాద్ నగరం అంతా పైలాయించిందట.

## ఉల్టా చోర్ కోత్వాల్ కో డాంటే

నిజాం నవాబుల కాలంలో తెలివైన దొంగలు కూడా ఉండేవారు. ఒక దొంగతనం కేసులో దొంగను గిరఫ్తార్ చేసి 'అదాలత్'ల హాజరు పరిచే సరికి వాడు తన నేరాన్ని ఒప్పుకోకుండా ఉల్టా పల్టాయించిపోయి నగర కొత్వాలే తనను దొంగతనం చేయమని పురికొల్పి ప్రోత్సహించాడని, తామిద్దరం చెరిసగం వాటాలు పంచుకుంటున్నామనీ కావున కొత్వాల్ గారికి (పోలీసు కమిష్నర్) కూడా సగం జైలు శిక్ష వేయాలని అడ్డంగా వాదించాడు. ఇక అప్పట్నించి ఎవరైనా అడ్డ దిడ్డంగా వాదిస్తుంటే ఈ సామెతను ఉపయోగిస్తారు.

## బాప్ కమానా బేటా గుమానా

అయ్య సంపాదిస్తే కొడుకు దుబారా చేసిండంట. గుమానా అంటే పోగొట్టటం, చెమటోడ్చి కష్టపడితేనే డబ్బు విలువ తెలుస్తుందని ఈ సామెతను వాడుతారు.

## బొమ్మన్ కా గల్లీ నదేఖో
## ముసల్మాన్ కా రసోయి మత్ దేఖో?

ఇది కాలం చెల్లిన సామెతనే అయినా హాస్యానికి వాడుతారు. కావున ఎవరూ సీరియస్‌గా తీసుకోకూడదు. విని నవ్వుకుని మరిచి పోవాలి. బ్రాహ్మలు విందు భోజనాలు ముగించి ఎంగిలి విస్తరాకుల వెనుక నున్న గల్లీలోకి విసిరివేస్తారని, అట్లాగే విందుల సమయంలో ముస్లింల వంటిల్లు రకరకాల మాంసాలు ఎముకలతో భీభత్సంగా ఉంటుందని హాస్యంగా చెప్పే సామెత ఇది.

## సేఠ్ అందర్ మునీమ్ బాహర్?

ఇది వ్యాపార వ్యవహారానికి సంబంధించిన సామెత. అందర్ హో జానా అంటే నష్టపోవటం దివాలాతీయటం. ఒక యజమాని తన వ్యాపారాన్ని తన దగ్గర పని చేసే మునీమ్‌కు అంటే గుమాస్తాకు అప్పచెప్పేసరికి వాడు మోసం చేసి, యజమానిని ముంచి తనుమాత్రం బయటపడటం లేదా తప్పుకోవడం అయ్యిందట. ఇది సర్వసాధారణంగా జరిగే విషయమే. అందుకోసమే పెద్దలు మంటిపనికైనా ఇంటి మనిషి దగ్గరుండి చేయించుకోవాలని అంటుంటరు.

## ఖయాలీ పులావ్ పకానా

గాలిలో మేడలు కట్టటం అని తెలుగులో దీనికి దగ్గరి సామెత. ఖయాల్ అంటే ఆలోచన. వెనకటికి ఒక కంజూస్ (పిసినారి) భర్త, తన భార్యతో నేను నా ఆలోచనలలోనే పులావ్ వండుతాను. నువ్వు నీ ఆలోచనలలోనే తిన్నట్లు ఊహించుకో అన్నడట. గాలిలో పేలపిండి కృష్ణార్పణం లేదా పునాదులు లేకుండానే పథకాలు వేయడం దీనికి దగ్గరి సామెతలు.

## లేట్ లతీఫ్

ఆఫీసుకు ఆలస్యంగా వచ్చేవారిని హాస్యంగా లేట్ లతీఫ్ అని పిలుస్తారు. విందులకు, వినోదాలకు శుభకార్యాలకు ఆలస్యంగా వచ్చేవారిని కూడా తొందరగా వచ్చిన వాళ్లు ఈ సామెతను వారిపై ప్రయోగించి ఆటపట్టేస్తారు. మరి ఈ లతీఫ్ అన్న పేరు ఎందుకు వచ్చిందో పరిశోధన చేయాలి!

## ఏక్ సె బడ్‌కర్ ఏక్

దీనికి దగ్గరి తెలుగు సామెత మొనగాళ్లకు మొనగాడు. తల తన్నేవాడొకడుంటే తాడిని తన్నేవాడు మరొకడు. హిందీలో మరొక సామెత తూ సేర్ హై తో మై సవాసేర్, నహ్లే పే దైలా లాంటివి.

## ఎక్ మార్ - దొ టుక్ దే

ఒక దెబ్బకు రెండు పిట్టలు అన్నమాట. ఇంగ్లీషులో వన్ బర్డ్ టు షాట్స్. హిందీలో ఏక్ తీర్ దో నిషానీ లేదా ఏక్ తీర్ సే దో షికార్. ఒక లక్ష్యాన్ని ఛేదిస్తూనే రెండు ప్రయోజనాలను సాధించాలి.

## బచ్చా బగల్ మే డూండ్‌రే షహర్ మే

ఒడిలో బిడ్డను పెట్టుకుని ఊరంత వెదికినట్లు అనేది తెలుగులో సరిపోయే సామెత. పైసను పారేసుకున్నది ఒక ఒకచోట, వెదికేది మరోచోట అన్నట్లు సత్యాన్వేషణ సరైన దారిలో సాగాలన్నదే ఈ సామెత సారాంశం.

## భాగ్‌తా చోర్‌కీ లంగోటీ హీ సహీ

పూర్వం రోజులలో దొంగలు తమ శరీరంపై చిన్న లంగోటీ (స్మాల్ డ్రాయర్) మాత్రమే ధరించి వొళ్లంతా నూనె, నల్లటి మసి పూసుకుని దొంగతనాలు చేసేవాళ్లు. అట్లా ఒక దొంగ ఒక ఇంట్లో దొంగిలించిన సొమ్ము సొత్తు తలపైకెత్తుకుని పారిపోతుంటే ఇంటి యజమాని వాడి వెంటపడి దొంగను పట్టుకొబోయి పొరపాటున వాడి లంగోటి పట్టుకునే సరికి అదికాస్తా

చిరిగి చేతిలోకి వచ్చిందట, దొంగ నగ్నంగానే పారిపోయాడంట. సొత్తు పోయినా లంగోటి అయినా దక్కిందని ఇంటి యజమాని సంతోషించాడట. అంటే ఎంత నష్టపోయినా కొంతలో కొంత లాభం వస్తే అదే చాలని తృప్తి పడటం అన్నమాట.

## కాలా అక్షర్ భైంస్ బారాబర్

నిరక్షరాస్యుడికి నల్లటి ప్రతి అక్షరం జంతువులు, పక్షుల ఆకారంలో కనబడుతవని ఈ సామెత సారాంశం. చదువురాని వారిని ఎగతాళి చేయటం కోసమే ఈ సామెత పుట్టింది.

## నఖల్ కే లియే అకల్ చాహియే

పరీక్షలలో కాపీ కొట్టటానికి చూసి రాయటానికి కూడా తెలివి ఉండాలని ఈ సామెత తెలియ చేస్తుంది. కనీసం రాసే అభ్యాసం కూడాలేని వాడు కాపీ ఎట్లా కొడతాడనేది పెద్ద ప్రశ్న. దొంగతనానికి కూడా చాకచక్యం, తెలివి అవసరమే కదా! మరి ఆ మాత్రం అకల్ ఉన్నోడు నకల్ ఎందుకు కొడ్తడన్నది ఇంకో ప్రశ్న.



# మద్యపానానికి సంబంధించిన సామెతలు

## ఖాయే నై పీయే నై
## చారానే కా గిలాస్ పోడ్‌దియే

దీని అర్థం: ఏ పనీ ప్రారంభించక ముందే నష్టం వచ్చిందని. కొంత మంది పాన ప్రియులు కలిసి మధుశాలకు వెళ్లారు. వీరిలో ఒక తొందర మనిషి తాగక ముందే చషకాన్ని (గిలాసను) కింద పడేయటం వలన అది పగిలి పోయి దాని ధర చారానా చెల్లించ వలసి వచ్చింది. వెంట ఉన్న స్నేహితులు కొంచెం బాధతో, మరి కొంత హాస్యంగా పై మాటలు అనగా అది ఒక సామెతగా చెలామణి లోకి వచ్చింది.

## రాత్ మే ఖానా దిన్ మే సోనా

రాత్రంతా గానా బజానాలతో గడిపి పొద్దంతా నిద్రపోయే నవాబులకు ఇది వర్తిస్తుంది. రాత్ మే ఖావో పీయో దిన్ మే ఆరాం కరో అని కిషోర్ కుమార్ పాడిన పాత హిందీ పాట మనం విన్నదే ...

## బీబీసీ మే లీటర్ మీటర్

ఇది తాగుబోతులకు సంబంధించిన పక్కా హైదరాబాద్ సామెత 'ఏం రా పొద్దు మీకి బీబీసీల కల్సుకుని ఏమైనా లీటర్ మీటర్ హై యా నై' అని సంకేతాలు ఇచ్చుకుంటరు. అమాయకులకు 'బీబీసీ' అంటే వార్తలు ప్రసారం చేసే 'ఛానెల్'. కాని తెలివైన వారి కోడ్ భాష వేరే. అది ప్రతి దినం వాళ్లు కల్సుకునే అడ్డాపేరు. నాంపల్లి చౌరస్తల ఇప్పటికీ బీబీసీ ఉంది. అంటే 'బొంబై బార్ అండ్ కేఫ్'. లీటర్ అంటే ఫుల్ బాటిల్. మరి మీటర్ అన్న పదం యాడికెల్లి ఎందుకొచ్చిందో నాకైతే తెల్వది. పాఠకులకు అంతగనంగ ఖాయిష్ ఉంటే ఒక్కపాలి బీబీసీ మెహఫిల్‌లకు కాలుబెట్టి ఆడ ఉండే ఉమర్ ఖయ్యాం భయ్యాలను అడుగాలె.

## తాష్కెంట్ మే రాకిట్

ఇది సుత అసుంటి సామెతనే. తాష్కెంట్ అంటే తాగుబోతుల కోడ్ భాషలో కల్లు కాంపౌండ్. ఒక్కప్పుడు హైద్రాబాద్‌ల చాన చాన మషూర్ అయిన కల్లు కంపౌండ్లు వుండేవి. సర్కారు వారు అవన్నీ ఇప్పుడు బందు పెట్టిన్రు. సాయంత్రం పూట కల్లుతోపాటు చాక్నా, బోటీ, కబాబ్, సీకులు, గుడాలు, బొబ్బుడాలతోపాటు కొండాకచో కవిత్వాలు, షేర్‌షాయిర్లు కూడా వొలికిపోయేటివి. అధో జగత్ సహోదరుల పెదాల మీద జానపద లల్లాయి గీతాలు అలవోకగా దొర్లిపోయేటివి. కలిసి తాగే మొగోల్లు ఆడోల్లకు కలిసి తాగే ఏర్పాటు ఉండేది గానీ అమ్మలకు, అక్కలకు తడికెలు గట్టిన సపరేట్ సెక్షన్ భీ ఉండెడ్డి. కష్టాలు కన్నీళ్లు వొలకబోసుకుంట ముచ్చట్లు సాగేవి. అది సరే ... రాకిట్ ఏందని అడుగుతుంద్రా? ఏం లే భై ... రాకిట్ అంటే గుడుంబా సీసా. అది కడుపుల బడంగనే ఇంగ్లం వొలె మండి పానం రాకిట్ లాగ మొగలు మీదికి ఎగుర్తది. అందుకే రాకెట్ అని ముద్దు పేరు. సరే గని సముద్రంలోని ఉప్పుకు చెట్టుమీది ఉసరికాయకు ఏం సంబంధం? తాష్కెంట్‌కు కల్లు కాంపౌండుకు ఏం సంబంధం? అని ప్రశ్నల మీద ప్రశ్నలడిగి నా పానం తీయకుంద్రి.

## చార్మినార్ భరండీ - మదీనా బిర్యానీ

పాత రోజులలో నిరక్షరాస్యులకు బ్రాండీ పదం అనరాక భరండీ అనేవారు. ఒక యాభై సంవత్సరాల క్రితం హైదరాబాద్ పాత నగరంలో ఒకే ఒక 'బార్' పత్తర్‌గట్టీలో ఉండేది. దాన్ని ఉర్దూలో 'షరాబ్‌ఖానా', 'షరాబ్‌కీ అడ్డా' అనేవారు. పైస గల్ల పోరలు అండ్లతాగి ఎదురుంగ ఉండే మదీనా హోటల్‌లో కెల్లి బక్రీ కా బిర్యానీ, తందూరీ చికెన్‌లు తినేవారు. ఆ షరాబ్‌ఖానా వలన పోరలు చెడిపోతుండ్రని ముసలోల్లకు కోపం. అవకాశం దొరికినప్పుడల్లా 'వాడు చార్మినార్ భరండీకి మదీనా బిర్యానీకి బాగా అలవాటయిండు' అని తిట్టటంతో ఈ సామెత వచ్చింది.

## పాంచ్‌సాల్ కా బల్దియా
## ఖాయాపీయా చల్దియా

ఒకప్పుడు హైద్రాబాద్ నగరం మున్సిపాలిటీగా వున్నపుడు పుట్టిన సామెత ఇది. మున్సిపాలిటీ పదవీ కాలం ఐదు సంవత్సరాలు. మున్సిపల్ కౌన్సిలర్ పదవి కాలం కూడా అంతే. వారు ఆ కాలంలో తమ వార్డు అభివృద్ధికి కృషి చేయక తాగి, తిని, సంపాదించి వెళ్లిపోతారని వ్యంగ్యంగా, హాస్యంగా విమర్శించే సామెత ఇది. ఈ సామెత ఇప్పటికి కూడా చాలా మంది ప్రజా ప్రతినిధులకు వర్తిస్తుంది.





# జంతువులు, పక్షుల సంబంధ సామెతలు

## మాలిక్ మేహర్బాన్ హై తో గధా భీ పహిల్వాన్

ఎటువంటి అర్హతలు, విలువా లేకున్నా రాజు గారి బామ్మర్ది అధికారం చెలాయించినట్లు, యజమాని దయాదాక్షిణ్యాలు ఉంటే గాడిద కూడా బలంగా మారి అధికారం చెలాయిస్తుందని దీని అర్థం. అర్హతలు లేకున్నా అందలమెక్కే వారికి ఈ సామెత వర్తిస్తుంది. సినిమా రంగంలో, రాజకీయ రంగంలో వంశ పారంపర్య హక్కుగా కొంత మంది చొరబడి ప్రముఖంగా వెలిగిపోతుంటే ఈ సామెత చటుక్కున యాదికొస్తుంది.

## సర్కార్‌కే సామ్నే గధే కే పీఛే నహీ చల్‌నా

గాడిద వెనుక నడిచినా కాళ్లతో గట్టిగా తన్నుతుంది. ప్రభుత్వానికి ముందు నడిచినా అంటే ఎదిరించినా, సవాల్ చేసినా అది కూడా తన్నుతుందని, దుష్ట ప్రభుత్వం గాడిదతో సమానమని దీని అర్థం. కావున అధికారంలో ఉన్నవారిని ఎదిరించకుండా తల వంచుకుని బ్రతకాలని ముసలివాళ్లు యువతరానికి అనుభవంతో చెప్పే సామెత.

## గధే కో క్యా మాలూం జాఫ్రాన్ కా ఖుష్బూ

గాడిదకేం తెలుసు గంధపు చెక్కల సువాసన! మూర్ఖులకు విలువల గురించి తెలియదని దీని అర్థం. విలువైన విషయాలను అర్హుల ముందే మాట్లాడాలని అనర్హులముందు అన్ని సంగతులు మాట్లాడి అభాసుపాలు కావొద్దని సలహా.

## హాథీ కే దాంత్ దిఖానే కే అలగ్ చాబ్‌నే కే అలగ్

ఏనుగుకు రెండు రకాల దంతాలు ఉంటాయి. కనబడే దంతాలు ఇవతల, నమిలి మింగే దంతాలు లోపల ఉంటాయి. అట్లనే కొంత మంది మాటలు వేరు, చేతలు వేరు అని అర్థం. కపటులు తమ ఆలోచనలను కుటిలంగా లోపల దాచుకుంటారు.

## హాథీ నికల్ గయా లేకిన్ దూమ్ అటక్ గయా

ఏనుగు వెళ్లి పోయింది. కానీ తోక మాత్రం ఇరికి పోయిందట. పెద్ద సమస్యకు పరిష్కారం దొరికినా చివరికి చిన్న సంగతి మాత్రం చిక్కుల్లో ఇరుక్కుందని అర్థం. తెలంగాణ ఇస్తాం. కాని హైద్రాబాద్‌కు మాత్రం గొళ్లెం పెడతాం. అన్నట్లు!

## చారానా ముర్గీ కో బారానా మసాలా

పని చిన్నదే కాని ప్రయత్నం పెద్దది అని అర్థం. ఒక వస్తువు మూలధర స్వల్పంగానే ఉంటుంది. కాని నగిషీలు చెక్కి కళాత్మకంగా మలచటానికి ఎక్కువ

ధర వసూలు చేస్తారు. బంగారు నగలు దీనికి మంచి ఉదాహరణ. అటువంటి సందర్భాలలో ఈ సామెత గుర్తుకు వస్తుంది.

## జిస్ కా లాఠీ
## ఉస్ కా భైంస్

బడితె కలవాడిదే బర్రె అన్నట్లు. బలవంతులు, ధనవంతులదే రాజ్యం అన్నట్లు. నోటున్నవాడే ఓటును కొనుకున్నట్లు. ఇట్లా ఎన్నైనా చెప్పుకోవచ్చు. పసిడి కలిగిన వానికి బానిస కొడుకులు అని వేమన ఆనాడే చెప్పాడు.

## సౌ చువ్వే ఖాకే బిల్లి హజ్ కూ గయీ

వంద ఎలకల్ని తిన్న పిల్లి పాప పరిహారం కోసం కాశీకి వెళ్లిందని తెలుగు సామెత. "దయ్యాలు వేదాలు" వల్లించినట్లు అనేది కూడా దీనికి దగ్గరి సామెత. పాపాలు, అవినీతి పనులు చేసేవారు శ్రీరంగ నీతులు వల్లించటం మనకు తెలిసిన సంగతే కదా!

## హమారీ కుత్తా హమారే సే భౌభౌ

నమ్మిన వారే విశ్వాస ఘాతుకానికి ఒడిగట్టినప్పుడు ఈ సామెత వాడుతారు. తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టటం అంటే కూడా ఇదే.

## గధా ఘోడా దో భీ బరాబర్

సర్కారీ నౌకరీలకు ఈ సామెత సరిగ్గా సరిపోతుంది. సర్కారీ దఫ్తర్ ల పనిచేసే వాడు, చెయ్యనివాడు ఇద్దరూ ఒక్కటేనని ... నెలాఖరుకు ఇద్దరికీ జీతం వస్తుందని ఈ సామెత సారాంశం. 'ఏం పరేషాన్ భై నేనేమో మా ఆఫీసుల గాడిద లెక్క చాకిరి చేస్తుంటే, నా పక్క సీటోడు సీటీలు బజాయించుకుంట బజార్లపొంట తిర్గుతడు. మా ఆఫీసుల 'గధా ఘోడా దో భీ బరాబర్' అని అంగలార్చటం మనకు తెలిసిన సంగతే.

## ఘర్ మే ఖానా
## మామూ కే బక్రే చరానా

'తినేది మొగని సొమ్ము పాడేది వేరొకని పాట' అని తెలుగు సామెత. 'మన ఇంట్లోని తిండి తింటూ పిల్లనిచ్చిన మామ మేకల్ని మేపినట్లు' అని దీని అర్థం.

## ఘర్ కీ ముర్గీ - దాల్ బరాబర్

ఇంటిలో పెంచుకునే కోడికి విలువ తక్కువ. దానిని ఎప్పుడంటే అప్పుడు కోసుకొని తినవచ్చు. కానీ అందులో రుచి తక్కువ. అది ప్రతి రోజు తినే పప్పుతో సమానమే. అందుకే కొంత మంది 'పొరుగింటి పుల్లకూర రుచి మీదమనసు పారేసుకుంటారు. ఈజీ పనిల మజా ఉండదు. అట్లనే 'పుకట్‌కు దొరికే దానిల కూడా మజా దొరకదు' అని దీని భావం.

## గధేకీ బిర్యానీ దోభీకా పరేషానీ
## ఊపర్ సే నిజాం సర్కార్ కీ నిగ్‌రాని

షోయబుల్లాఖాన్ ప్రముఖ జాతీయవాది. పాత్రికేయుడు. తన ఉర్దూ పత్రిక 'ఇమ్రోజ్'లో పై ఉదంతాన్ని వర్ణిస్తూ వ్యాసం రాసినందుకు నిజాం సర్కార్ ఆగ్రహానికీ, రజాకార్ల దుర్మార్గానికీ బలైనాడు. ఒక హోటల్ యజమాని హైదరాబాద్ నగరంలో ప్రతి రాత్రీ ఒక గాడిదను అపహరించి దాన్ని చంపి ఆ మాంసంతో బిర్యాని వండి మేక మాంసం బిర్యానీ అని ప్రచారం చేస్తూ అతి తక్కువ ధరకు అమ్ముతుంటే ... ప్రజలు క్యూ కట్టి తినసాగారు. నాలుగు రోజులు గడిచేసరికి చాకలి వాళ్లల్లో గడ్‌బడ్ మొదలయ్యింది. తమ గాడిదలు మాయం అవుతున్నాయన్న విషయం నిజాం నవాబు దృష్టికి వెళ్లే సరికి ఆయన 'ఖడీ సక్త్ నిగ్‌రానీ' పెట్టగా అసలు సంగతి తెల్సింది. అట్ల ఒక నిజమైన సంఘటన హాస్య సామెతకు దారి తీసింది.

## ఫీల్ ఉడీ బోలేతో భైంస్ ఉడీ బోల్తే

చిలువలు పలువలుగా పుకార్లను ప్రచారం చేస్తున్నారు అని చెప్పే సందర్భంలో ఈ సామెతను ఉదహరిస్తారు. గద్ద ఎగిరింది. అని ఒకడంటే కాదు బర్రెనే ఎగిరింది అని మరొకడు. తను చూసినట్లే చెప్పుతాడు. ఒక నిజాన్ని ప్రజలు ఈ నోటా ఆ నోటా చెప్పుకుంటున్నపుడు అది చివరివాడి చెవికి చేరేసరికి దాని రూపం, సారం రెండు పూర్తిగా మారిపోతాయి. మానవ నైజానికి అద్దం పట్టే సామెత ఇది. కావున నైజాం కాలంలో "చార్మినార్ చబుత్రా మీద పుకార్లు షికార్లు చేస్తయి" అనేవారు.

## దోభీ కా గధా న ఘర్‌కా న ఘాట్‌కా?

పిల్లల్ని తిట్టేటపుడు తల్లిదండ్రులు ఈ సామెతను తరచుగా వాడుతారు. అటు ఇటు గాకుండా అడ్డగాడిదలా తిరుగకు అని, ఇటు వ్యవసాయమో వ్యాపారమో, లేక అటు చదువో ఏదో ఒకటి చూసుకోమని లేక పోతే ఎటూకాకుండా పోతావని హెచ్చరించేటపుడు ఈ సామెతను కోపంగా ఉదహరిస్తారు.

## దర్వాజా బంద్ కర్‌కే మారేతో
## బిల్లీ భీ షేర్ బన్‌జాతీ

తలుపులు బందు చేసి కొడితే పిల్లి కూడా పులిలాగ మారుతుందని అర్థం. ఇది నిజంగానే జరిగిన సంఘటన. ఒకతను పిల్లిని గదిలో బంధించి కొడుతుంటే అది దిక్కు తోచక భయంతో పైకెగిరి అతడి గొంతు పట్టుకుని గట్టిగా కొరికితే అతను చనిపోయాడట. కావున ఎవరినీ శ్రుతి మించి శిక్షించకూడదని అవమానించరాదని, మధ్యేమార్గంగా వుండాలని ఇదొక హితబోధ.

## ఉడ్తీ చిడియా కే పర్ గిన్‌నా

ఆకాశంలో ఎగిరే పక్షి యొక్క రెక్కల్ని లెక్కపెట్టటం అంటే సునిశిత బుద్ధి, అతి చాలాకీతనం, తెలివితేటలు అని అర్థం. విద్యార్థులు, యువకులు ఈ విధంగా ఉండాలి అని చెప్పేటపుడు పెద్దలు ఈ సామెతను వాడుతారు. వాడు అవులిస్తే పేగులు లెక్కపెడతాడు అనేది దీనికి దగ్గరి తెలుగు సామెత.

## తీతర్ బీతర్ హోజానా

దీనిని అపభ్రంశంగా తెలుగులో తిత్తరబిత్తర కావటం అంటారు. తీతర్ అంటే పక్షులు, పక్షుల గుంపుల వోలె చెదిరి పోవటం, మనుషుల జీవితం అస్తవ్యస్తమయినపుడు భగ్నమైనపుడు ఈ సామెతను వాడుతారు.

## సాంప్ భీ మార్ జాయే, లాఠీ భీ న టూటే.

కర్ర విరగకుండా పాము చావాలట. అంటే ఏ పని చేసినా నైపుణ్యంతో చేయాలని, ఏక కాలంలో రెండు ప్రయోజనాలు కలగాలని, నష్టం లేకుండా లాభం పొందాలని పెద్దలు అనుభవజ్ఞానంతో చెప్పే జీవిత సారమిది.

# నైతిక, తాత్విక, మత సంబంధ సామెతలు

## తీన్ తేరా నౌ అఠారా

జీవితం కుక్కలు చింపిన విస్తరిలా మారిందని అర్థం. మానవ సంబంధాలు కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు విచ్ఛిన్నమైనపుడు “అయ్యో మన బతుకులన్నీ తీన్ తేరా నౌ అఠారా”లు అయ్యాయి అని అంగలార్చుతారు.

## అకల్ మంద్ కో ఇషారా కాఫీ

బుద్ధి హీనులకు ఎంత చెప్పినా అర్థం కాదు. తెలివిగల వాడికి ఒక సైగ చాలు అని అర్థం.

## హమామ్ మే సబ్ నంగే

అంతరంగంలో ఉండే ఆత్మల అద్దాల ముందు అందరూ అబద్దాల కోరులే అని మానవ నైజం గురించి చెప్పే సామెత ఇది. మచ్చలేని మనుషులు ఎవరూ ఉండరని, అందరూ తెలిసీ, తెలియక తప్పులు చేస్తారని మానవ ప్రవృత్తిని విప్పి చెప్పే సామెత ఇది.

## మెహనత్ కరేతో మేవా మిల్తా

కష్టే ఫలికి దగ్గరి సామెత ఇది. మెహనత్ అంటే కష్టం. మేవా అంటే మిఠాయి.

## సబర్ కా ఫల్ మీఠా హోతా హై

ఓపిక, సహనం వుంటే పండు బాగా పండి మగ్గి తియ్యగా మారినట్లే జీవితంలో కూడా ఓపిక, సహనం వహిస్తే చివరలో ఫలితం మధురంగా ఉంటుందని దీని భావన. కష్టాలలో ఉన్నవారికి ఈ సామెత పెద్ద ఓదార్పు.

## జాదా హుషారీ
## మౌత్ కీ నిషానీ

దీనికి దగ్గరి తెలుగు సామెత 'చలాకి పిట్ట నిన్ను నేలకేసి కొట్ట'. అతి తెలివి ప్రమాదాలకు, మృత్యువుకు దారితీస్తుందని దీని నీతి. చచ్చిన సింహానికి ప్రాణం పోసి చివరికి దానిచేతిలోనే తన ప్రాణాన్ని పోగొట్టుకున్న ఒక అతి తెలివివంతుడి కథ మనకు తెల్సినదే.

## ఢూంఢె తో ఖుదా భీ మిల్తా హై

ప్రయత్నిస్తే ప్రతి పని సాధ్యమవుతుంది. 'దేవులాడితే దేవుడు కూడా దొరుకుతడు బిడ్డా' అని పెద్దలు పిన్నలకు హితవు చెప్పే సామెత ఇది. అన్వేషిస్తుంటే ఏదో ఒక రోజు సత్య సందర్శనం జరుగుతుందని దీని మతలబు.

## దర్ద్ హీ దర్ద్ కా దవా హై

ఇదొక తాత్విక భావన కలిగిన సామెత. ప్రేమకు, తియ్యటి విరహానికి ఈ సామెత సరిపోతుంది. దేవదాసు సిన్మాలోని 'భాధే సౌఖ్యమనే ... భావన రానీ వోయ్' అన్న పాట ఈ సామెతకు దగ్గరగా ఉంటుంది. 'ఊష్ణం ... ఉష్ణే శీతలం' అన్నట్లు ప్రేమ రోగానికి ప్రేమే సరియైన మందు.

## పైసా హీ - పర్మాత్మా హై

గుజరాతీలు, మార్వాడీలు ఈ సామెతను ఎక్కువగా వాడుతుంటారు. 'ధనం మూలం మిధం జగత్' అన్న తెలుగు సామెత ఈ అర్థాన్నే స్ఫురిస్తుంది. డబ్బు జబ్బు కలిగిన వారు నిధిలోనే రాముని స'న్నిధి'ని చూస్తారని ఈ సామెత నిరూపిస్తుంది.

## జైసా కర్నా - వైసా భర్నా

చేసుకున్న వాడికి చేసుకున్నంత మహదేవా' అనేది లేదా' మంచి కానీ చెడుకానీ ఎట్ల చేసుకుంటే అట్ల అనుభవిస్తం' అనేవి దీనికి దగ్గరగా ఉండే తెలుగు సామెతలు. మన మాటలు మన చేతలే మన జీవితాలను నిర్ణయిస్తాయి అని తెలియచేసేదే ఆ సామెత. కావున మన నడక, మన నడత సరిగ్గా ఉండాలె.

## నియ్యత్ కిత్నా - బర్కత్ ఉత్నా

నియ్యత్ అంటే నీతి, నిజాయితీలు. బర్కత్ అంటే లాభం, సమృద్ధి, గిట్టుబాటు కావడం. మన నియ్యత్ సాఫ్‌గ ఉంటే బతుకు గూడ అనందంగ ఉంటుందని ఈ సామెత చెప్పే నీతి.

## దేర్ హై మగర్ అందేర్ నహీ హై

ఎవరైనా సమస్యలలో పీకలలోతు మునిగిపోయి పరిష్కారం కోసం నిరీక్షిస్తు న్నపుడు, ఈ కష్టాలు ఎప్పుడు గట్టెకుత్తాయిరా దేవుడా అని అంగలార్చుకున్నపుడు అనుభవజ్ఞులు వంద మాటలు చెప్పే బదులు ఈ ఒక

సామెతను చెప్పి జిందగీ మీద భరోసా పెంచుతారు. జీవితంలో ఆలస్యం కావచ్చు గాని అంధకారం మాత్రం లేదని విశ్వాసం కల్గిస్తారు.

## జాన్ హై తో జహన్ హై

బ్రతికుంటే బచ్చలాకు తిని బ్రతుకొచ్చు అని తెలుగు సామెత. మనం ప్రాణంతో వుంటేనే మిగతా ప్రపంచం ఉంటుందని, మనం లేకపోతే ఏమీ ఉండదనీ కూడా దీని అర్థం. అస్తిత్వ వాదానికి చెందిన సామెత ఇది.

## డాక్టర్ సాబ్ కీ దవా ఔర్ మౌల్వీసాబ్ కీ దువా

రోగి కోలుకోవటానికి దవా, దువా రెండూ అవసరమే. వైద్యం, మందులు ఎంత అవసరమో పెద్దల దీవెనలు కూడా అంతే అవసరమని ప్రజలు భావించటమే ఈ సామెత.

## పేఠ్ పే మార్నా మగర్ పీఠ్ పే నహీం మార్నా

ఇది మానవీయ, నైతిక విలువలకు సంబంధించిన సలహా "డోంట్ హిట్ బిలో ద బెల్ట్" అని ఇంగ్లీషులో, కొట్టు కాని కడుపు మీద కొట్టొద్దు అని తెలుగులో దీనికి సమానమైన సామెతలు ఉన్నాయి. మనిషిని శిక్షించాలి కాని సంహరించకూడదని దీని అంతరార్థం. వీపు మీద కొడితే నొప్పి మాత్రమే కలుగుతుంది కాని కడుపు మీద కొడితే ప్రమాదం జరుగుతుందని ప్రాణాలు పోతాయని ఒక హెచ్చరిక.

## చాదర్ సే బాహర్ పైర్ నహీం ఫైలానా

చాపను దాటి కాళ్లు చాపకూడదని, ఉన్నంతలో సర్దుకుపోవాలని, ఆదాయాల లోపలే ఖర్చు ఉండాలని, మితిమీరిన వ్యయం చేయరాదని ఈ సామెత ఇచ్చే సందేశం.

## జల్దీకా కామ్ షైతాన్ కా కామ్

అదరాబాదరగా, హడావుడిగా పనులు చేయరాదని, అట్లా చేస్తే పనులు చెడిపోతాయని చెప్తూతూ ... దయ్యాలు మాత్రమే తొందరపడి పనులు

చేస్తాయని, మనం మనుష్యులం అట్లా చేయవద్దని హాస్యంగా చెప్పే ఆత్మీయ వచనం ఇది.

**ఆటామే నమక్ మిలానా లేకిన్**
**నమక్ మే ఆటా న మిలానా**

పిండిలో ఉప్పు కలపాలి కాని ఉప్పులో పిండి కలుపకూడదని దీని సూటి అర్థం. అనగా ఏ తప్పు, అవినీతి, అన్యాయం చేసినా అది పరిమితులలో మితంగా ఉంటేనే ఎవరికీ తెలియదని, లేకపోతే లోకానికి తెలుస్తుందని తెలియజెప్పే నీతి సామెత. అబద్ధం ఆడినా అతికినట్టు ఉండాలని, దొంగతనం చేసినా దొరకరాదని చెప్పే సామెతలకు ఇది దగ్గరి సామెత.

**దానే దానే కే ఊపర్ లిఖా హువా హై**
**ఖానే వాలే కా నామ్**

అల్లా మియా ఎవరికి ఎంత ఇవ్వాలో అంత ఇస్తాడని, ప్రతి బియ్యపు గింజ మీద తినేవారి పేరు లిఖిస్తాడని ఈ సామెత సారాంశం. ఈ సామెత హాస్యంగా కూడా అనేక సందర్భాలలో అనేక అర్థాలతో వాడుతారు. "నూకలు చెల్లిపోవటం" అనే తెలుగు సామెత దీనికి దగ్గరగా ఉంటుంది.

**జుఖానే వాలా హై తో**
**సారీ దునియా భీ జుక్తీ హై**

వంచే వాడుంటే యావత్ ప్రపంచమే లొంగుతుందని దాని భావం. కావున అసాధ్యమనేది ఏదీ లేదని అన్నింటిని ప్రయత్నిస్తే సాధించ వచ్చని ఈ సామెత తెలియజేస్తుంది.

**పత్తర్ పే లిఖిర్**

ప్రభుత్వ శాసనాలు శిలాక్షరాలు అన్నట్లు ఉర్దూలో ఈ సామెత. నా వాక్కు వేదవాక్కు అన్నట్లు. బైబిల్‌లో మోజెస్ సత్యాన్వేషణను చేస్తూ అతీతశక్తి ఇచ్చిన టెన్ కమాండెంట్స్‌ను "శిలాక్షరాలుగా" లోకానికి వెల్లడి చేయటం మనకు తెలిసిన సంగతే.

- పరవస్తు లోకేశ్వర్

A C No...
హైదరాబాద్ 500 044



# తిట్ల సామెతలు

## మరీజ్ కో బిస్తర్ పే హీ మార్నా ఉఠేతో షేర్ బన్ జాతా

ఇక్కడ మరీజ్ అంటే రోగి కాని అసలు ఉద్దేశ్యం శత్రువు బలహీనంగా ఉన్నప్పుడే దెబ్బ తీయాలి. కోలుకుంటే పులి అవుతాడు. ఇనుమును వేడి మీదే వంచినట్లు! కావున సరైన సమయం, సందర్భంలోనే శత్రువు మీద దెబ్బతీయాలి అని దీని అర్థం.

## గఢీ మే తోలా గఢీ మే మాషా

ఒక బంగారం వ్యాపారి త్రాసులో బంగారాన్ని జోకుతూ ఒకసారి తులం అని అంతలోనే మాసం అని గిరాకీలను తికమక పెట్టితే ఈ సామెత పుట్టింది. 'గడికి చిత్తం గాడిద రోగం' అనేది దీనికి దగ్గరగా ఉండే తెలుగు సామెత. చపల చిత్తులకు, తిక్కలోళ్లకు ఈ సామెత వర్తిస్తుంది.

## అంధేర్ నగరీ చౌపట్ రాజా

చీకటి రాజ్యానికి చవట రాజు అన్నట్లు. అసలే రాజ్యం అస్తవ్యస్తంగా ఉంటే అసమర్థుడైనవాడు రాజుగా ఉంటే ఏం జరుగుతుందో ఊహించటం కోసమే ఈ సామెత.

## ఖబాబ్ మే హడ్డీ

పాయసంలో పుడక అన్నట్లు. కొంత మంది తగుదునమ్మా అని అన్నింటిలోనూ తలదూరుస్తారు. పిలవని పేరంటంలాగ. అటువంటి వారికి నిక్‌నేమ్ ఈ సామెత.

## టపక్ సుపారీ

ఇతరులు సీరియస్‌గా మాట్లాడుతుంటే మధ్యలో అనవసరంగా జోక్యం చేసుకునేటోడు. పంటిక్రింది రాయిలా అందరికీ అడ్డం పడుతుంటాడు.

## లాతోం కా బూత్
## బాతోం సే నహీ మాన్తీ

తంతే కాని దారికి రాని దయ్యానికి మంచి మాటలు పనికి రావని కావున దుర్మార్గులకు వారి భాషలోనే బుద్ధి చెప్పాలని దీని అర్థం. ఎసుంటోడికి అసుంటి జవాబ్ అన్నమాట.

## ఈంట్ కా జవాబ్ పత్తర్ సే

శత్రువు విమర్శను బలంగా తిప్పికొట్టడమే దీని అర్థం. దీనిని మూతోడ్ జవాబ్ అని కూడా అంటారు. తమలపాకుతో నువ్వొకటంటే తలుపు చెక్కతో నే రెండంటా అన్నట్లు. దీనికి దగ్గరగా ఉండే మరో ఉర్దూ సామెత.

## తూ సేర్ హై తో మై సవా సేర్!

దీనికి దగ్గరి తెలుగు సామెత "నీ కంటె రెండు ఆకులు ఎక్కువ చదివాను" లేదా నువ్వు మొండి అయితే నేను జగమొండిని అని అర్థం.

## సునేతో ఇదరీ నైతో ఉదరీ

చపలచిత్తం, తిక్కలోడు అని చెప్పటానికి ఈ సామెతను ఉదహరిస్తారు. వాడు వింటే వింటాడు లేదంటే అసలే వినడు అని కూడా అర్థం.

## చోర్ ఖందీల్ ముర్గీ చోర్

దాదాపు ఈ రెండు అర్థాలు ఒకటే. కుటిలుడు, మోసగాడిని ఇట్లాంటి పేరుతో పిలుస్తారు. తెలుగులో దొంగ కోళ్లుపట్టే ముఖం లేదా దొంగ ముఖం అనటం దీనికి దగ్గరి సామెత.

## ఐసీ కీ తైసీ

తిట్ల పరంపరలో ఒక భాగమే ఈ సామెత. తెలుగులో దీనికి సరిపోయే అనువాద సామెత లేదు. కాని దగ్గరి భావం గల సామెతలు నీ తస్సాదియ్య, నీ సిగగొయ్య లాంటివి చెప్పవచ్చు. నీ ముండామొయ్య కూడా ఇట్లాంటిదే.

## చున్ చున్ కే మార్నా

కోపం, ప్రతీకారానికి సంబంధించిన సామెత ఇది. శత్రువులను, ప్రతిధ్వం ధులను ఒక్కొక్కరిని ఎంచుకుని వధించాలని, నిర్మూలించాలని దీని భావం. అందర్ని ఒకేసారి ఎదుర్కోలేమని కూడా దీని అంతరార్థం.

## హడ్డీ పస్లీ ఏక్ కర్నా

దీని ప్రయోగ సందర్భం కూడా కోపం, ప్రతీకారాలే. పస్లీ అనగా వన్నెముక శరీరంలోని ఎముకలన్నింటినీ వెన్నెముకతో కలుపుతానంటే అర్థం శరీరాన్ని చితకొట్టి బంతిలాగా చేస్తానని హెచ్చరించటం.

## ఆస్మాన్ పర్ థూక్నా

ఆకాశం మీద ఉమ్మేయటం. పెద్దలను, గౌరవనీయులను విమర్శించరాదని అట్లా చేస్తే మన పరువేపోతదని దీని భావం. అనవసరమైన, అసంగతమైన విమర్శ చేయరాదని ఒక హిత వచనం.

## చాంద్ పర్ థూక్నా

పై సామెతకు మరో ప్రత్యామ్నాయ సామెత ఇది. అసాధ్యమైన, అనవసర విమర్శ అని భావం.

## చట్టీ కా దూద్ యాద్ ఆనా

శిశువు జన్మించిన ఆరవ రోజు ముస్లింలు పురుడులాంటి ఒక పండగ కార్యక్రమం చేసేదే చట్టి. ఆ తర్వాత నలభై రోజుల కార్యక్రమ వేడుకలను "చిల్లా" అంటారు. చట్టి కార్యక్రమం రోజు శిశువుకు ఒక విధమైన, ప్రత్యేక మైన పాలు పడతారు. ప్రత్యర్థులు ఎవరినైనా బెదిరించే సందర్భంలో "బడ్డా నా దెబ్బకు నువ్వు చిన్నప్పుడు తాగిన ఉగ్గుపాలు జ్ఞాపకం రావాలి" అనటమే ఈ సామెత అర్థం.

## అకల్ కే దుష్మన్

ఒరే తెలివి హీనుడా, తెలివి తకువ దద్దమ్మ అని తిట్టేటపుడు ఈ సామెతను వాడుతారు. అనగా తెలివిగా ఉండటానికి వాడు వ్యతిరేకం అని ఒక హాస్యంగా ఒక వ్యంగ్యంగా చెప్పే సామెత ఇది.

## తెరీ నాఖ్ మే రస్సీ

ఇదొక తిట్టు సామెత. నీకు ముక్కు తాడు వెయ్యా అని దీనర్థం. అంటే, నిన్ను జంతువుని అదుపులో పెట్టినట్టు అదుపులో పెడతా అని హెచ్చరించటం. నా వెంట తిప్పుకుంటా అని బెదిరించటం.



# అశ్లీల సామెతలు

**ఖుఖా హైసో వాలా సుకా హైసో వాలేకా గాండ్ మారేతో**
**దోనో భీ బేహోష్ హోకర్ గిర్‌గయే**

అకలితో ఉన్నవాడు నీర్సంగా ఉన్నోడ్ని కొట్టేసరికి ఇద్దరికీ చాతకాక కిందపడి స్పృహ తప్పారట. జోగి జోగి రాసుకుంటే బూడిద రాలినట్లు!

**ఖానే కో గతీ నహీ హై మగర్ లంజ కు బులావ్**

తెలుగు, ఉర్దూ భాషల సమ్మేళనానికి ఈ సామెత ఒక సంకేతం ఈ మిశ్రమం తియ్యని హాస్యాన్ని సృష్టిస్తుంది. తినటానికి గతిలేదు కాని మీసాలకు సంపెంగ నూనె అన్నది దీనికి దగ్గరి సామెత. బతికి చెడిన ఒక నవాబుకు తినటానికే గతిలేదు, కానీ వేశ్యను పిలవమని హుకుం జారీ చేశాడట.

## దస్తర్ పే ఔర్ బిస్తర్ పే
## షర్మానా నహీ

ముస్లింలు భోజనానికి పరుచుకునే బట్టను 'దస్తర్' లేదా 'దస్తర్ ఖానా' అంటారు. బిస్తర్ అంటే పరువు మరియు పక్కచుట్ట. భోజనం ముందు లేదా పడకపైన సిగ్గు పడరాదని ఇదొక హెచ్చరిక. ఈ రెండింటి ముందు సిగ్గుపడితే సుఖం దక్కదని ఈ సామెత సారాంశం.

## చీల్ చీఖ్‌నా జ్యాదా
## చోద్ నా కమ్

వట్టి గొడ్డుకు అరుపులెక్కువ అనే సామెత దీనికి దగ్గరగా ఉంటుంది. సంభోగానికి ముందు గ్రద్ద ఎక్కువగా అరుస్తుంది. కాని అసలు పని తక్కువగా చేస్తుందని. అట్లనే కోతల రాయులు కోతలు కోస్తారు కాని కార్యోన్ముఖులు కాదని జీవిత సత్యం చెప్పే సామెత ఇది.

## గాండూ హాథీ ఫౌజ్ కో భారీ

పిరికి ఏనుగు సైన్యానికి అనవసరమైన బరువని నిజం చెప్పే సామెత. దాని నిర్వహణకు ఖర్చు, స్థలం చాలా ఎక్కువని మరి అటువంటి ఏనుగు యుద్ధంలో ఉపయోగపడక పిరికితనంతో పారిపోతే అది ఉండి ఏం లాభమని ప్రశ్నించే సామెత. మనుషులు కూడా కొంత మంది సమాజానికి అనవసరమైన బరువుగానే ఉంటారు తప్ప వారివల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదని తెలియజేయటం. ఈ సామెత వెనుక వాస్తమైన సంగతి కూడా ఉంది. కత్తులు కటారులతో యుద్ధం చేసే కాలంలో ఏనుగుల పాత్ర ఉండేది. అయితే శత్రువులు కొత్తగా ముందుగుండు సామాగ్రి, ఫిరంగులు, తుపాకులతో యుద్ధరంగంలో దాడి చేసే సరికి ఆ భీకర శబ్దాలకు, విధ్వంసానికి ఏనుగులు భయపడి వెనక్కి పారిపోతూ, తమ సైన్యాన్నే తొక్కేసి పోయేటివి. అందులో నుండి వచ్చిన సామెత ఇది.

## నంగా లౌడా భగ్వాన్ దాస్

ఇది కూడా వాస్తవానికి సంబంధించిన సామెతనే. దేశంలో ఇస్లాం ప్రవేశించి, ముస్లిం రాజ్య స్థాపన జరిగిన తర్వాత పుట్టిన సామెత ఇది. కొంత మంది జైన మునులు, హిందూ సన్యాసులు, సాధువులు పూర్తిగా దిగంబరంగా ఉండటం చూసి ముస్లింలు ఏగతాళిగా ఆటపట్టించే ఉద్దేశ్యంతో ఈ సామెతను సృష్టించారు. కర్నాటక రాష్ట్రంలోని శ్రవణ బెళగోల బాహుబలి నగ్న విగ్రహం దీనికి మంచి ఉదాహరణ. అయితే ఇప్పుడు ఈ సామెతను "వీడు పరమ దరిద్రుడు, వీడి చేతిలో ఒక రూపాయి కూడా లేదని" హాస్యంగా వ్యగ్యంగా తెలియజేయటం కోసం ఉపయోగిస్తారు.

## గాచారం గాండ్ మారేతో
## ఖుదా భీ క్యా కరేగా

గ్రహచారం పట్టుకున్న వాడిని దేవుడు మాత్రం ఎట్లా రక్షిస్తాడని నిస్సహాయతను తెలియచేసే సామెత. ఇది దీని వెనుక కూడా ఒక హాస్య కథ ఉంది. ఒక పరమ దరిద్రుడు తనకు పట్టిన శనిని వదిలించమని ఒక పురోహితుడిని పూజల కోసం ఆశ్రయించాడు. ఆ పురోహితుడు గోదానం చేస్తే శని వదులుతుందని సలహా ఇచ్చాడు. అయ్యా నేను దరిద్రుడిని గోదానం చేయలేను అన్నాడట. పోని ఒక చిన్న యజ్ఞం అంటే అదీ కుదరదు అన్నాడట. పోనీ పది మంది బ్రహ్మలకు అన్నదానం అంటే తన తిండికే గతిలేదు అన్నాడట. సరే ఒక కొబ్బరి కాయ పట్టుకరా దేవుడికి కొట్టి నీ తరపున ప్రార్థన చేస్తా అంటే అయ్యా పూజారీగారూ కొబ్బరి కాయకొనటానికి ఒక పైసా అయినా కావాలి కదా నా దగ్గర చిల్లగవ్వ కూడా లేదు అని దరిద్రుడు దీనంగా మొత్తుకున్నాడట. దాంతో ఒళ్లమండి ఆ పూజారి తన విలువైన సమయం వృధా అయ్యిందన్న కోపంతో "ఒక చిల్లగవ్వ కూడా లేని పరమదరిద్రుడిని ఇక ఆ శని దేవుడు మాత్రం ఏం బాధిస్తాడు? ఆ దేవుడు కూడా శనిదేవుడి బారి నుండి ఎట్లా రక్షిస్తాడు? అని అరిచి ఆ శని బాధితుడిని అకడ్నుంచి తన్ని తరిమేసాడట. అందులో నుండి పుట్టిన బూతు సామెత ఇది.

## దర్ దర్ కే చోధేతో ఘర్‌బర్ బచ్చే హీ బచ్చే

కుటుంబ నియంత్రణ సాధనాలు, సౌకర్యాలు లేని రోజులలో వచ్చిన సామెత ఇది. దరిద్రులకు సంతానమెక్కువ అన్నట్లు పిల్లలు కలిగేతే వారిని సాకలేనేమో అని భయపడుతూనే భార్యను కలుసుకున్న ఒక పేదవాడికి ఇంటి నిండా సంతానమే కలిగారట. అనుమానాలు, భయాలతో ఒక పని ప్రారంభిస్తే అలానే నిజమవుతుందని నిరూపించే సామెత ఇది.

## ఘూతియా సల్ఫేట్

దగ్గరి జిగ్రీ దోస్తులను తిట్టే బూతు సామెత ఇది. యాభై అరవై ఏండ్ల క్రితం ఇది బాగా చెలామణీలో ఉండేది. కాని ఇటీవలి కాలంలో ఇష్కియా అనే హిందీ సినిమాలో హీరోయిన్ విద్యాబాలన్ ఈ పదాన్ని అనేకసార్లు ఉపయోగిస్తుంది. సల్ఫేట్ ఒక రసాయనిక పదార్థం. మరి బూతు పదానికి దీనికి లింకు ఎలా కుదిరిందో, ఆ పదాన్ని ఎట్లా కనిపెట్టారో భగవంతుడికే తెలియాలి.





# దాంపత్య స్త్రీ-పురుష సంబంధ సామెతలు ...

### మియా కీ దౌడ్ మస్జిద్ తక్

ఒక భర్త తన భార్యతో గొడవపడి ఇక నేను నీతో కాపురం చేయలేను మక్కాకు వెళ్లుతున్నానని చెప్పి ఇంటి దగ్గరలో నున్న మసీదులో కూచుని మధ్యాహ్నం ఆకలి కాంగనే అన్నానికి ఇంటికి వచ్చిందట. అప్పుడు ఆ భార్య వ్యంగ్యంగా, హాస్యంగా అన్నమాట సామెతగా స్థిరపడింది. ఆరంభ శూరులకు ఈ సామెత వర్తిస్తుంది.

### మై ఖిలాడీ, తూ అనాడీ

రంకులాడి పెళ్లానికి అమాయకపు మొగడు అన్నట్లు.

## రూప్‌కీ రానీ చోరోంకా రాజా

చక్కని చుక్క టక్కరి దొంగ దీనికి సరిపోయే తెలుగు సామెత. వెనకట ఒక జంట ఉండేది, వాడేమో గండరగండడు గజదొంగ. అదేమో కులుకు కుటారి మిణుకు మిరారి. పూర్వం రోజులలో ఇంకా మూకీ సిన్మాలు కూడా రాని రోజులలో తోలుబొమ్మలాటలో జుట్టుపోలిగాడు, బంగారక్కలాగ ఉర్దూభాషలో ఈ జంటకు సంబంధించిన సామెత వచ్చింది.

## ఖుద్బ ఖుద్

ఒక ఘటన దానంతట అదే జరగటాన్ని ఖుద్బ ఖుద్ అంటారు. అంటే ఆటోమాటిక్‌గా జరగటం. ఒక భర్తకు పుర్రెలో ఏదో పురుగు తిరిగి ఈ రోజు నుంచి మాంసాహారాన్ని మానేస్తున్నానని భార్య ముందు ప్రకటించాడట. నాలుగు రోజులు దాల్‌ఖానా తిన్నాక ఐదో రోజు మటన్‌పై మనసు పీకిందట. భార్య ముందు చులకన కావద్దు కాని ఎట్లనన్న మాంసం తినాలని తీవ్రంగా ఆలోచించి ఉత్త మాంసం శోర్వా వడ్డించు అన్నాడు. ఆమె శోర్వా వేస్తుంటే కుండలో నుంచి కొన్ని మాంసం ముక్కలు ప్లేట్‌లో పడ్డాయి. ఆమె అయ్యో అని ఆ పడిన మాంసం ముక్కల్ని వెనకకు తీయబోతుంటే ఏం తప్పులేదు. అంతా ఆ అల్లాదయ కుద్బకుద్ పడిన వాట్ని తింటే తప్పులేదు అని సమర్థించుకున్నాడట. అట్ల ఖుద్బఖుద్ సామెత చెలామణి లోకి వచ్చింది.

## సర్కారీ బండీ మే కిత్నే చుహ్వే

చుహ్వే అంటే ఎలుకలు. ధనికులను 'సర్కార్' అని పిలవటం ఒక రీతి రివాజ్. నైజా కాలంలో ఆటోలు లేవు కావున ధనికులు తమ ఆడపిల్లల్ని గూడులాగా నిర్మించిన ఎడ్ల బండ్లల్లో పరదాలు కట్టి పాఠశాలలకు పంపేవారు. ఘోషా - పర్దాలు పాటించే కాలం అది. కొంటె కుర్రాళ్లు వాళ్లను బనాయించటానికి (ఏడిపించటానికి) ఆ బండి చుట్టుపక్కల చక్కర్లు కొడుతూ 'సర్కారీ బండీ మే కిత్నే చుహ్వే' అని అరిచేవారు. ఆ సరదాల పరదాల వెనుక నలుగురు ఉంటే 'చార్ చుహ్వే' అని మిగిలిన మొగపిల్లలు కేకలేసేవారు.

- పరవస్తు లోకేశ్వర్

పరదాల వెనుక ఉన్న పూబోడుల సంగతేమో గానీ బండి వాడికి కోపం వచ్చి చేతిలోని కమ్చీని (కొరడా) ఆ కొంటె కుర్రాళ్లపై ఝుళిపించే సరికి కిస కిస నవ్వుకుంటూ వారు చెల్లాచెదరయ్యేవారు. ఈ సామెత 'ఈవ్ టీజింగ్' గురించి తెలియజేస్తుంది. నవయవ్వనాలు, చక్కిలిగింతలు కలిగించే సతాయించటాలు అప్పుడు ఇప్పుడు ఏ కాలంలోనైనా ఉండేవే కదా!

### జబ్ మియా బీవీ రాజీ
### తో క్యా కరేగా ఖాజీ

ఒక ఊర్లో మొగుడూ పెళ్లాం గొడవ పడి తలాఖ్ కోసం (విడాకులు) ఖాజీ వద్దకు వెళ్లారట. 'సరే ఈ రోజు నేను బిజీ. రేపు నేనే మీ ఇంటికి వచ్చి తలాఖ్ నామా రాసి సంతకాలు తీసుకుంటా'నని చెప్పి మరునాడు ఆ దంపతుల ఇంటికి వెళ్లేసరికి వాళ్లు రాజీపడి హాయిగా నవ్వుకుంటూ ఉన్నారట. ఖాజీ గారు విసుక్కుంటూ ... అనవసరంగా వచ్చానని చింతిస్తూ తిరిగివెళ్లాడట. ఆ మాటనే సామెతగా మారింది ...

### మై భీ రాణీ తూ భీ రాణీ
### కౌన్ బరేగా ఘర్ కా పానీ

ఇద్దరు సవతులు ఒకే ఇంట్లో ఉంటే వచ్చే కొట్లాట ఇది. ఇద్దరు కూడా ఇంటికి రాణిని నేనంటే నేనని పోటీ పడుతుంటే ఇంటి పని ఎవరు చేస్తారని భర్త మొత్తుకోవటమే ఈ సామెత. తిండి సంగతేమోగాని చివరికి తాగే నీళ్లు కూడా ఇంట్లో ఉండవని ఆ భర్త మొత్తుకోవటంతో ఈ సామెత వచ్చింది. కావున పనులు అందరూ పంచుకుని చేసుకోవాలని హితవు చెప్పే సామెత ఇది.





# వ్యాపార, వ్యవహారిక సామెతలు ...

## నాచ్ నా నహీ ఆయేతో ఆంగన్ తేడా

అడలేక మద్దెల ఓడు అన్నట్లు. నా అందానికేం తక్కువ అద్దమే బాగా లేదు అన్నట్లు.

## దలీందర్ జో హై దర్‌ఖాస్తు దియేతో
## ఖచేరీ ఖుద్ బర్కాస్ హోగయా

దరిద్రుడు ఇవ్వక ఇవ్వక ఒక రోజు విజ్ఞాపన పత్రం ఇచ్చే సరికి, అంత వరకూ అక్కడున్న ఆఫీసు అడ్రస్ లేకుండా మూత బడిందట. 'దరిద్రుడి పెండ్లికి వడగండ్ల వాన' అన్నట్లు దరిద్రుడు ఏ పని ప్రారంభించినా పురిట్లోనే సంధి కొట్టినట్టు ముగుస్తుంది.

## రాత్ గయి - బాత్ గయి

తాగుబోతులు రాత్రి మద్యం సేవించినప్పుడు చాలా విషయాలు మాట్లాడుతరు. గొప్పలు చెబుతరు. అసాధ్యమైనవి సాధ్యం చేసే విధంగా మాట్లాడుతరు. ఆ విషయాలను నిజమని, నమ్మకూడదని, ఆ మాటల భ్రమల్లో పడకూడదని తెల్లవారితే గాని తెలవదని దీనికి మరో అర్థం.

ఇచ్చిన మాట తప్పేటపుడు ఈ సామెత వాడి తప్పించుకుంటారు కొందరు మహానుభావులు. 'అరే ఏందీ భై నిన్న నువ్వు ఈ రోజు నా అప్పు చెల్లిస్తనని మాట ఇస్తివి గదా!' అని ఒక అమాయకుడు అడిగితే 'అరే జా భే, రాత్ గయి - బాత్ భీ గయి' అని గడుసువాడు తప్పించుకుంటడు. కాని తెలుగులో దీనికి విరుద్ధమైన ఒక మంచి మాట ఉంది. "నోరు జారొద్దు. ఎందుకంటే దినం గడిచిపోతది కాని మాట మిగిలిపోతది".

## పాన్‌దాన్ ఖాన్‌దాన్

నైజాం కాలంలో ప్రజలందరూ పాన్ తినేవారు. ప్రతి ఇంటిలో పాన్‌దాన్ ఉండేది. అతిథులు రాగానే వారి ముందు పాన్‌దాన్ చాలా మర్యాదగా పెట్టేవారు. పాన్‌దాన్ ఆ ఇంటి వారి హోదా, అంతస్తును తెలిపేటట్టు ఉండేది. ధనికులు ఆడంబరమైన, నగీషీలు చెక్కిన, లతలు, పువ్వులతో అలంకరించబడిన వెండి పాన్‌దాన్‌లు వాడితే సామాన్యులు సాదా సీదా పిత్తల్ పాన్‌దాన్‌లను వాడేవారు. అందుకే 'షాదీ కా రిష్తా' పక్కా చేసుకునే ముందు 'పాన్‌దాన్ ఔర్ ఖాన్‌దాన్'ను జరచూసి అప్పుడు ఫైస్లా చేయండి అని పెద్దలు సలహా చెప్పేవాళ్లు.

## బాల్ బాల్ మే బచ్ గయే

వెంట్రుక వాసిలో గండం తప్పిపోవడం అన్నమాట. 'అరే నిన్న రాత్రీల మోటర్ టక్కర్ అయ్యింది భై, కని బాల్ బాల్ మే బచాయించి పోయిన' అని జిగ్రీ దోస్తుల ముందు చెప్పుకోవటం మనం విన్న సంగతే.

## హర్ దర్ద్ కా దవా జిందాతిలిస్మాత్

'అన్ని సమస్యలకు ఒక్కటే పరిష్కారం' అన్న అర్థంతో ఈ సామెతను వాడుతారు. పూర్వకాలంలో డాక్టరు వద్దకు వెళ్ళలేని గరీబులు కడుపునొప్పి, కాలినొప్పి, పంటినొప్పి, తుంటినొప్పి, వాంతులు విరేచనాలతో సహా అన్నింటికీ సర్వరోగ నివారిణిలా రెండు చుక్కల 'జిందా తిలిస్మాత్'ను వాడటం వలన ఈ సామెత ప్రచారంలోకి వచ్చింది. వర్తమాన తెలంగాణ సమాజం ఎదుర్కొంటున్న అన్ని రుగ్మతలకు ప్రత్యేక రాష్ట్రమొక్కటే పరిష్కారమన్నట్లు!

## నోట్ల పాన్ - ఇంట్ల ఫోన్

ఇది కూడా పూర్వ కాలం సామెతనే. ఫోన్ ఒకప్పుడు విలాసానికి, హుందాకు, హోదాకు చిహ్నం. హమేషా పాన్ నమలటం కూడా 'షాన్'కు సంబంధించిన సంగతే. పాన్‌దాన్, ఒగల్‌దాన్ (ఉమ్మిపాత్ర) లాంటివన్నీ రాచరిక భూస్వామ్య కాలంలో విలాసాలకు సంబంధించిన కులాసాలే! కావుననే అమీరును చూసిన మరో గరీబు 'వానికేం భై నోట్లే పాన్ ఇంట్ల ఫోన్' అని వ్యాఖ్యానించేవాడు. ఈ కాలంలో పాన్‌లు తక్కువై ఫోన్‌లు ఎక్కువైనాయి.

## ఆలూ టమాటా - ఘీ కా పరాటా

ఒక వ్యక్తి హోదాను, అంతస్తును జీవితాన్ని సూచించే సామెత ఇది. పేదలు దండోల్ల (ధనికులు) గురించి మాట్లాడుకునేటప్పుడు అరే వాల్లకేంది భై, ప్రతిదినం వాల్ల ఇండ్లల్ల 'ఆలూ టమాట - ఘీ కా పరాటాలు' అని ముక్తాయింపులు ఇచ్చేవారు.

## గ్యారా కద్దూ బారా కోత్వాల్

జరిగిన ఒక నిజమైన సంఘటనలోనుంచి ఈ సామెత పుట్టింది. సురవరం ప్రతాపరెడ్డి గారు ఈ సామెతను వివరిస్తూ ఆనాటి సమాజ స్థితిగతులపై ఒక కథ కూడా రాశారు. అమాయకమైన గ్రామీణులు పొట్ట చేత పట్టుకుని పట్టణానికి వస్తే, పట్నంలోని ప్రతివాడు అధికారిని అని చెప్పి ఎట్లా మోసం చేశారో ఈ సామెత చెప్పే కథ. ఓ అమాయకుడు పదకొండు ఆనపకాయల్ని అమ్మటానికి పట్నం వచ్చి ఫుట్‌పాత్‌పై పరుచుకొని కూచుంటే

ఎవరెవరో వచ్చి నేను ఈ నగరానికి కొత్వాల్‌ను, ఇక్కడ పర్మిషన్ లేకుండా కూచున్నందుకు 'గిరఫ్తార్' చేస్తా అని బెదిరించి ఒక కాయను పట్టుకొని పోయాడు. ఇలాగే పదకొండు కాయలు మాయం అయి పోయాయి. పన్నెండో మనిషి వచ్చి నేనే అసలైన కొత్వాల్‌ను ఇక్కడ పని పాట లేకుండా ఖాళీగా ఎందుకు కూచున్నావ్ గిరఫ్తార్ చేస్తా అని బెదిరించగా వాడు 'గ్యారా కద్దూ బారా కోత్వాల్' అని ఏడుస్తూ కథంతా చెప్పాడట. పేదలపై పోలీసుల జులుంకు ఈ సామెత మంచి ఉదాహరణ.

## సౌ దిన్ సాస్‌కి, ఏక్ దిన్ బహుకి

అత్త ఎన్ని కష్టాలు పెట్టినా ఏదో ఒక రోజు కోడలుకు కూడా అవకాశం వస్తుందని అన్ని రోజులు ఒకేలా ఉండవనీ అత్త పెట్టే కష్టాలకు కోడళ్లకు ఓదార్పునిచ్చే సామెత ఇది. అత్తలు ముసలితనంలో మంచంలో పడితే కోడళ్లు సరిగా చూసుకోక ప్రతీకారం తీర్చుకుంటారు సుమా అని హెచ్చరిక చేసేది కూడా.

## తీర్ ఏక్ తరఫ్
## నిశానీ దుస్రీ తరఫ్

బాణం ఒక చోట. గురి మరొక చోటా అని దీని అర్థం. లక్ష్యం గమ్యం సూటిగా ఉండాలని. చేసే పని మీద శ్రద్ధ పెట్టాలని దీని భావం. అర్జునుడి బాణం గురిలాగా మన మనస్సు లక్ష్యం, గురి నుండి చెదరవద్దు అని హితవు చెప్పే సామెత.

## తురుంఖాన్

నువ్వేమైనా పెద్ద తురుంఖాన్ వారా? అని ముసలోళ్లు యువకుల్ని తిట్టటం మామూలే. ఎవరీ తురుంఖాన్ అనేది చాలా మందికి తెలియదు. ఆ అసలు పూర్తి పేరు తుర్రేబాజ్‌ఖాన్. రోహిల్లా వీరుడు. 1857లో హైద్రబాద్ నగరంలో సిపాయిల తిరుగుబాటు నాయకుడు, గొప్ప వీరుడు. కొఠీలోని రెసిడెన్సీ భవనంపై తన అనుచరులతో కల్సి, దాడిచేసి తప్పించుకుని మెదక్ జిల్లా తూప్రాన్ వద్ద పట్టుబడినాడు. ఇతనిని నగరానికి తీసుకొచ్చి పుత్లీబౌలీ

ప్రాంతంలో బహిరంగంగా ఉరివేసి ఆ శవాన్ని మూడు రోజులు అట్లాగే గొలుసులతో వేలాడ దీశారు. ఈ వీరుడి గౌరవార్థం కోఠీ ఆంధ్రాబ్యాంకు సూల్తాన్ బజార్ గల్లీకి తుర్రేబాజ్‌ఖాన్ రోడ్ అని నామకరణం చేశారు. అట్ల వీరత్వానికి గుర్తు తురుంఖాన్ అన్న సంక్షిప్తనామం.

## తీస్ మార్‌ఖాన్

ఈ పేరు కూడా 1857 సిపాయిల తిరుగుబాటు హైద్రాబాద్ కు సంబంధించినదే. చీతాఖాన్ ఒక చిన్న సైనిక పటాలానికి నాయకుడు. నిజాం నవాబు హైద్రాబాద్‌లోని బ్రిటిష్ రెసిడెంటుతో ఒప్పదం చేసుకుని ఔరంగబాద్‌లో ఉన్న తన సైనికులను బ్రిటిష్ సైనికులతో కల్సి ఢిల్లీకి వెళ్లి సిపాయిల తిరుగుబాటును అణచివేయమని తన సైనికులకు ఆజ్ఞాపించగా చీతాఖాన్ తన పటాలంతో కల్సి నిజాం నవాబుకు, ఇంగ్లీషు వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి ముప్పై మంది ఇంగ్లీషు సైనికులను చంపినందున "తీస్ మార్‌ఖాన్" అని ప్రజలు కీర్తించారు. చీతాఖాన్ పేరు తీస్ మార్‌ఖాన్ గానే స్థిరపడింది. ఇతడిని బంధించి హైద్రాబాద్‌కు రప్పించి కోఠీలోని రెసిడెంటు భవనం నేలమాళిగలో ఖైదు చేశారు. (దానిని ఇపుడు కోఠీ ఉమెన్స్ కాలేజీ అని పిలుస్తున్నాం.) ఈ చీతాఖాన్‌ని విడిపించటానికే తుర్రేబాజ్‌ఖాన్ కోఠీ రెసిడెన్సీపై దాడి చేసి విఫలమయినాడు.

## బారాఖూన్ మాఫ్

ఇది భీ బిల్కుల్ మజాక్ ముహావరానే. అంటే హాస్య సామెత అన్న మాట. నిజమెంతో అబద్ధమెంతో తెల్వదుగాని నిజాం నవాబు ఒక కొత్త డాక్టరుకు ప్రాక్టీసు పెట్టుకునేందుకు లైసెన్సు జారీ చేస్తూ వచ్చీరాని వైద్యంతో నువ్వు 12 మందిని చంపినా పరవాలేదు గాని ఆ తర్వాత మాత్రం నేనొప్పుకొను అని హెచ్చరించినాడట. అంటే కొత్త కుర్ర డాక్టర్ ఎవర్రైనా పన్నెండు మందిని తన చేతగాని తనంతో చంపొచ్చని పేషెంట్లు మజాక్ చేస్తూ "ఓ డాక్టర్ సాబ్ వక్త్‌సే పహెలే హీ ఊపర్ బిజా దేతేహై" అంటారు. "అరే నీకేందిరా, నీకు బారాఖూన్ మాఫ్ పో" అని అనటం వెనక అర్థం ఏంటంటే "బిడ్డా పని చేయి తప్పులు చేసినా ఫరవాలేదు" అని.

## బాత్ బతంగడ్ బనానా

బతంగడ్ అంటే వాచాలత్వం అని అర్థం. ఒక మామూలు, సాధారణమైన విషయాన్ని సాగదీసి చెప్పటం, సుత్తి కొట్టటం, సూటిగా చెప్పకుండా సంగతిని లాగదీసి చెప్పటం. క్లుప్తంగా, ముక్తసరిగా చెప్పకుండా అనవసరంగా వైనవైనాలుగా వర్ణించి చెప్పటంతో ఈ సామెత పుట్టింది.

## మొఖే కా ఫాయిదా ఉఠానా

మొఖా అంటే అవకాశం. ఫాయిదా అంటే లాభం. తెలివిపరులు లేదా మోసగాళ్లు అవకాశం కోసం ఎదిరిచూస్తూ అది రాగానే దాన్ని ఉపయోగించుకుని లాభపడతారు. ప్రయోజనం పొందుతారు. ఇది కూడా ఒక హిత వచనమే.

## జమీన్ ఆస్మాన్ ఫరక్ హై

భూమి ఆకాశానికి ఉన్నంత తేడా లేదా వ్యత్యాసం అని అర్థం. సులువుగా పోలిక తెచ్చి చెప్పటం కోసం ఈ సామెతను వాడుతారు. "వాళ్లిద్దరి మనస్తత్వాలలో చాలా భేదముంది" అని చెప్పేటపుడు కూడా ఈ సామెతను ఉపయోగిస్తారు.

## జమీన్ ఆస్మాన్ ఏక్ కర్నా

ఒక పనిని సాధించే క్రమంలో ఈ సామెతను వాడుతారు. ఎదేమైన భూమి ఆకాశాన్ని ఒకటిగా చేసి ఈ పనిని సాధించాలని చెప్పటమే. పనిని సాధిస్తాడని చెప్పటం లాంటిదే.

## అప్నారాగ్ అపన్ హీ ఆలాప్ నా

ఆత్మ స్తుతి చేసుకోవటం, స్వంత డబ్బాకొట్టుకోవటం తన గురించి తాను గొప్పలు చెప్పుకోవటం అన్నమాట. స్వార్ధపరులు, సంకుచిత మనస్తత్వం కలిగిన వారికి వర్తించే సామెత ఇది.

## ఇదర్ కీ దునియా ఉదర్ హోజానా

అనగా ఇటు ప్రపంచం అటు కావటం. అల్లకల్లోల్లం అత్లాకుత్లం కావటం. జీవితంలో ఆపదలు, అనుకొని సంఘటనలు జరిగినపుడు ఈ సామెతను వాడుతారు. మానసికంగా వచ్చే ప్రళయం, భూకంపాలన్న మాట.

## అర్మానోఁ పర్ పానీ ఫేర్నా

కోరికలు ఆశల మీద నీళ్లు చల్లటం అని దీనర్థం. ఆశలు ఆడియాశలు కావటం ఇతరుల వలన ఆశాభంగం చెందటం.

## జాన్ ఖానా
## తంగ్ కర్నా

పై రెండు సామెతలు కూడా ఒకే ఉద్దేశ్యానికి సంబంధించినవి. పిల్లలు పెద్దలను పైసల కోసం సతాయిస్తుంటే "మేరా జాన్ ఖాలేరా భై" అంటారు. నన్ను విసిగించకు అనేబదులు "మేరేకో తంగ్ మత్ కరో " అంటారు.

## బారా ఘాట్ కా పానీ పీనా

విస్తృతమైన జీవితం, వివిధ రకాల అనుభవాలు ఉన్న మనిషి గురించి తెలియ చెప్పే సామెత ఇది. రకరకాల ఊర్లల్లో రకరకాల నీళ్లను తాగటం అంటే అనేక ప్రాంతాలు, దేశాలు సంచరిస్తూ అనుభవాలు గడించటం. "అరే బేటా మై భీ బారా ఘాట్ కా పానీ పీయా మాలుం హై" అని కొంత మంది ఆత్మ స్తుతి చేసుకుంటారు.

## జోష్ సే నహీఁ హోష్ సే కామ్ లేనా

జోష్ అంటే ఉద్రేకం. హోష్ అంటే జాగ్రత్త లేదా తెలివి. యువతరం ఉద్రేకం, కోపంతో నిర్ణయాలు తీసుకుంటుంటే పెద్దలు వారిని వారిస్తూ తొందరపడి ఆలోచించకండి నిదానంగా నెమ్మదిగా తెలివితో పని చేయండి అని చెప్పే హితవచనం ఈ సామెత. అయితే ఉద్యమాలల్లో పిల్లల జోష్ పెద్దల హోష్ (అనుభవ జ్ఞానం) రెండూ అవసరమే.

## చుట్కియో మేఁ ఉడానా

చిటికెల మీద తేల్చేయటం అని దీనర్థం. ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తాం అని కొంత మంది ప్రగల్భాలు పలుకుతుంటారు. సందర్భాను సారం ఇతరుల అభిప్రాయాలను మాటలను నిర్లక్ష్యం చేయటం అని కూడా అర్థం వస్తుంది.

## చిరాగ్ లేకే ఢూండ్నా

చిరాగ్ అంటే దీపం. ఢూండ్న అంటే వెదకటం. అరే దీపం పెట్టి వెదికినా వీడిలో ఒక్క మంచి గుణం కనబడదు అని వాఖ్యానిచటం మనకు తెలిసిందే. దీపం పెట్టి వెదకటం అంటే నిశతంగా పరిశీలించటం అని అర్థం చేసుకోవాలి.

## చిరాగ్ కహాఁ రోష్నీ కహాఁ

దీపం వొకచోట ఉంటే వెలుగు మరొక చోట ఉందని దీని భావం. నిజానికి దీపాన్ని వెలుగును విడదీసి చూడలేం.

## సర్‌పే కఫన్ బాంధ్‌నా

చావుకి తెగించి యుద్ధానికి వెళ్లేవారు తమ నుదుటిన కఫన్ చుట్టుకుని పూర్వం రోజులలో బయలుదేరేవారు. ముస్లింలు శవానికి పైన కప్పే బట్టను కూడా కఫన్ అంటారు. ఉర్దూలోనే దీనికి మరో దగ్గరి సామెత "మర్నే కే లియే తయ్యార్ రహనా" అంటే చావటానికి సిద్ధంగా ఉండటం, కర్తవ్యాన్ని నిర్వహించటం కోసం కార్యోన్ముఖుల్ని కావించటం కోసం ఈ సామెతను ఒక యుద్ధ నినాదంగా ఉపయోగిస్తారు.

## దూద్ కా దూద్ పానీ కా పానీ

క్షీర నీర న్యాయం. పాలు పాలు నీళ్ళు నీళ్లుగా విడదీసే, తేటతెల్లం చేసే న్యాయనిర్ణయం. సరైన విశ్లేషణ. వివేచన. అవసరాన్ని తెలియచేసే సామెత

ఇది. అబ్బ ఏం చెప్పినవన్నా, అబ్బ ఏం రాసినవన్నా "దూద్ కా దూద్, పానీ కా పానీ" అని చాలా మంది తారీఫ్ చేస్తుంటరు.

## క్యా హై?
## దిన్ హై ఆంఖ్ మూచే రాత్ హై

ఎదుటివారిని ఎగతాళి చేసే సామెత ఇది. ఎవరైనా దేని గురించైనా ప్రశ్నిస్తే చెప్పకుండా తప్పించుకునే ఉద్దేశంతో కొంచెం హాస్యంగా, కొంచెం ఎగతాళిగా ఈ సామెతను ప్రయోగిస్తారు. మేలుకుంటే పగలు, నిద్రపోతే రాత్రి అని ఆకుకు అందకుండా పోకకు పొందకుండా జవాబు ఇస్తారు.






సామెతలను సృష్టించిన సామాన్యులు

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
ACC No. 98486
500032

హైద్రాబాద్ జనజీవితంలో ఉర్దూ సామెతలు

పరవస్తు లోకేశ్వర్

